క్లుప్తంగా

త్వరలో విజేతలకు బహుమతులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉగాది బాలల కథల పోటీల్లో విజేతలైన 27 మంది విద్యార్థులకు బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు సుగుణ సాహితీ సమితి కన్వీనర్ బైతి దుర్గయ్య ఆదివారం తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు కథలు రాసేలా ప్రోత్సహించిన 29 మంది ఉపాధ్యాయులకు సత్కారం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు, సాహిత్యాభిమానులు హాజరు కావాలని కోరారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం



కల్యాణికి ఆర్థిక సాయం అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): ధూళ్మిట్ట మండలం శివాలీతండాకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి లకావత్ కల్యాణికి జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ చెట్కూరి కమలాకర్ యాదవ్ ఆదివారం రూ.22 వేలు సహాయం అందించారు. కార్యక్రమంలో బెక్కల్ మాజీ సర్పంచ్‌లు బాలరాజు యాదవ్, యాదగిరి, ఉప సర్పంచ్ బాలయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు సాగర్ గౌడ్, మహేశ్ గౌడ్, నరేశ్‌యాదవ్, రమేశ్ ముదిరాజ్, లింగాల సాగర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ సహకారం



ఆర్థిక సహాయం అందిస్తున్న ఆర్యవైశ్య మహాసభ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో పేద విద్యార్థిని పార్వతి చైతన్య ఉన్నత చదువు కోసం రూ.27,500 సహాయం అందజేశారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్ నివాసంలో ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆర్యవైశ్య మహాసభ పేదలకు అండగా నిలుస్తుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కార్యవర్గ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్, జిల్లా అర్యవైశ్య మహాసభ కోశాధికారి మంకాల నవీన్ కుమార్, జిల్లా అదనపు కార్యదర్శి గంప కృష్ణమూర్తి, జిల్లా యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అర్వపల్లి హరికిరణ్, ఐత కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల అందజేత



దుప్పట్లను పంపిణీ చేస్తున్న వర్తకులు

గజ్వేల్: గజ్వేల్‌లోని కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పేదలకు తమ వంతు సహకారం అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలి పారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సిద్ది భిక్షపతి, కార్యదర్శి దూబకుంట మెట్రాములు, నాయకులు దూబకుంట ప్రభాకర్, కాపర్తి వైకుంఠం, శ్రీనివాస్, రాము, లింగం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత వైద్య విధానం రావాలి



మాట్లాడుతున్న చంద్రారెడ్డి

సిద్దిపేటకమాన్: నగదు రహిత వైద్య విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని, పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాములు, మహంకాళి, భూంరెడ్డి, గాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు పరామర్శ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్‌కు చెందిన రచం చంద్రయ్య ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆ కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించారు. గ్రామ నాయకులు రాజిరెడ్డి, గాజుల బాబు ద్వారా రూ.5 వేలు సహాయం అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

చినుకు పడితే చిత్తడి చిత్తడే

మట్టిరోడ్డుతో ఇక్కట్లు

- అభివృద్ధికి నోచుకోని దుంపలపల్లి
- పట్టించుకునే నాథుడు కరువు



దుంపలపల్లి 4వ వార్డులో బురదమయంగా మారిన మట్టిరోడ్డు

దుబ్బాకటౌన్: 'పేరు గొప్ప ఊరు దిబ్బ..' అన్నట్లుంది దుబ్బాక మున్సిపల్ పరిస్థితి. పేరుకు మున్సిపల్ అయినా.. ఉన్న 20 వార్డుల్లోను అభివృద్ధి అంతంత మాత్రమేనని ప్రజలు వాపోతున్నారు. దుబ్బాక, చెల్లాపూర్, దుంపలపల్లి, చెర్వాపూర్, మల్లాయపల్లి, లచ్చపేట, ధర్మాజీపేట కలుపుకొని మున్సిపల్‌గా ఏర్పాటైంది. ఒక పాలక వర్గం సైతం పాలించి ఇటీవల పదవీ కాలం ముగిసిన అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది. కాస్తో, కూస్తో దుబ్బాక అభివృద్ధి జరిగినా విలీన గ్రామాలు మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయని ప్రజలు అంటున్నారు.

సమస్యల వలయంలో విలీన గ్రామాలు

మున్సిపల్‌లో విలీనమైన ఆరు గ్రామాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. అవన్నీ మున్సిపల్‌లో విలీనమైనా అభివృద్ధి మాత్రం ఏమీలేదు. రోడ్లు, డ్రైనేజీలు సక్రమంగా లేక ప్రజలు చుక్కలు చూస్తున్నారు. గుంతల, మట్టి రోడ్లతో అవస్థలు పడుతున్నారు. పాలకవర్గం ఉన్నప్పుడు కౌన్సిలర్లు కొంచెం అభివృద్ధి చేసినా.. పెద్దపెద్ద సమస్యలు మాత్రం అలాగే మిగిలాయి.

నిధులు కేటాయించండి

మట్టి రోడ్డు నిర్మాణంతో పాటు వార్డులో పలు సమస్యలున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం దుబ్బాక మున్సిపల్‌కు ఇటీవల కేటాయించిన రూ.15 కోట్ల నిధులలో దుంపలపల్లిలో సమస్యలు తీర్చడానికి కేటాయించాలని అధికారులను కోరుతున్నారు.

చినుకుపడితే అంతే..

మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి 4వ వార్డులో కిలోమీటర్ మేర ఉన్న మట్టిరోడ్డుతో వార్డు ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే చాలు రోడ్డు చిత్తడిగా మారుతోంది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు, అధికారులు పట్టించుకుని బీటీరోడ్డు వేసి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

వర్షాకాలంలో మరిన్ని కష్టాలు



దుంపలపల్లి నుంచి సిద్దిపేటకు వెళ్లాలంటే ఈ రోడ్డు ద్వారానే ప్రయాణం చేయాల్సి ఉంది. ఈ రోడ్డు దగ్గర దారి కావడంతో చాలా మంది వాహనదారులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. మట్టిరోడ్డు వల్ల వాహనదారులే కాకుండా వార్డు ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దుంపలపల్లి అభివృద్ధికి సహకరించాలి.

\- సుమన్, దుంపలపల్లి

గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి

నియోజకవర్గ స్వయం సేవక్ కరుణాకర్‌రెడ్డి



కుకునూరుపల్లిలోని రాజీవ్ రహదారిపై ఆర్‌ఎస్‌ఎస్ కవాతు

కొండపాక(గజ్వేల్): ఆర్‌ఎస్‌ఎస్‌ను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేలా చేయడమే లక్ష్యంగా పని చేయాలని గజ్వేల్ నియోజక వర్గ స్వయం సేవక్ కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పథ సంచాలన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 100 యేళ్లు పూర్తయిన సందర్భంగా కవాతు నిర్వహించామన్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా ఎస్‌ఐ శ్రీనివాస్ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వర్గల్‌లో..

వర్గల్(గజ్వేల్): ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మెదక్ విభాగ్ హిందూ వాహిని ప్రముఖ్ ఎల్లగోని సత్యం జీ, పురుషోత్తం అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వర్గల్‌లో నిర్వహించిన విజయదశమి ఉత్సవం, ర్యాలీ, సమారోహ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ సమాజం జాగృతమయ్యేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాక: యువత దేశ సంరక్షణకు, ధర్మ పరిరక్షణకు ముందుకు రావాలని ఆర్‌ఎస్‌ఎస్ దుబ్బాక ఖండా కార్యవాహ కూరపాటి వెంకటేశ్ కోరారు. శతాబ్ది ఉత్సావాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం దుబ్బాకలోని ప్రధాన వీధుల గుండా కార్యకర్తలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రమశిక్షణ, సేవా భావం పెంపొందించడమే లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సహ కార్యవాహక్ లక్ష్మణ్, బాల్‌రాజు, రాజు, బాలేశ్‌గౌడ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో నిర్వహించిన కార్యక్రమంలో స్వయం సేవకులు గణేశ్‌తో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యవాహ అమరేంద్ర ప్రసాద్, ఖండ కార్యవాహ సుమన్, జిల్లా సంపర్క్ ప్రముఖ్ రవీందర్, బీజేపీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ శ్రేయస్సే లక్ష్యం

హుస్నాబాద్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పదసంచాలన్ నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ దేశ శ్రేయస్సే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ భావం పెంపొందాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతి ఒక్కరిలో జాతీయ భావం పెంపొందించడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని సామాజిక సమరసత వేదిక తెలంగాణ కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ అన్నారు. మిరుదొడ్డిలో పథ సంచలన్ నిర్వహించారు. నాయకులు శ్రీశైలం, రాజు, జిగిరి అమర్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

మిత్రురాలికి కవిత పరామర్శ



వెంకటలక్ష్మిని ఓదారుస్తున్న కవిత

సిద్దిపేటరూరల్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదివారం ఆమె స్నేహితురాలిని పరామర్శించారు. మండల పరిధిలోని చింతమడకకు చెందిన వెంకటలక్ష్మి భర్త మల్లారెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె మిత్రురాలైన కల్వకుంట్ల కవితకు విషయం తెలియడంతో కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 రోజుల వ్యవధిలోనే రెండోసారి చింతమడకకు రావాల్సిన వచ్చిందన్నారు. మిత్రురాలి భర్త చనిపోవడంతో బాధాకరమని, ఆమెకు ధైర్యం చెప్పేందుకే వచ్చానన్నారు. బతుకమ్మ ఆడేందుకు వచ్చిన సమయంలో గ్రామస్తులు స్వాగతించారన్నారని, ఆ సమయంలో వెంకటలక్ష్మి, బాలమణిలతో బతుకమ్మ ఆడినట్లు గుర్తు చేశారు. ఆడబిడ్డ భర్తను కోల్పోవడానికి మించిన వేరే కష్టం ఉండదన్నారు. ఆమె కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని కోరుకుంటున్నానన్నారు.

బహుజనుల ఐక్యతతోనే విజయం

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఉమేశ్



సంఘీభావం తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్: సిద్దిపేట జిల్లాలో త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బహుజనులను ఐక్యం చేసి విజయం సాధించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ పిలుపునిచ్చారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 26 జెడ్పీటీసీ స్థానాలను గెలిచే విధంగా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో బీఎస్పీ మాత్రమే బీసీల కోసం పని చేస్తుందని చెప్పారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల హక్కుల కోసం బీఎస్పీ మాత్రమే కృషి చేస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్, హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్, నాయకులు రాజు, బాబు, సుధాకర్, హనుమంతు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రవి



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

సిద్దిపేటజోన్: పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ భవన్‌లో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2010 కంటే ముందు నియామకం అయిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. అలాగే పీఆర్సీ, డీఏలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణం విడుదల చేయాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా భూపాల్, ఆర్థిక కార్యదర్శిగా రవీందర్, రాష్ట్ర కౌన్సిలర్లుగా రంగారావు, రవీందర్‌రెడ్డి, లింగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విలీనం చేయకపోతే బహిష్కరిస్తాం

అఖిలపక్ష నాయకులు



రేగొండలో సమావేశమైన అఖిలపక్ష నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): తమ గ్రామాలను హుస్నాబాద్ మండలంలో విలీనం చేయకపోతే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. మండలంలోని రేగొండ రెవెన్యూ గ్రామంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ తదితర పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రేగొండ, గోవర్ధనగిరి, మల్‌చెర్వుతండా గ్రామాలను హుస్నాబాద్‌లో కలపాలని డిమాండ్ చేశారు. ఈ గ్రామాలన్నీ అక్కన్నపేట మండలానికి దూరంగా ఉన్నాయని వాపోయారు. ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యం సరిగ్గా లేదని, ఏ నాయకుడు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల ముందే గ్రామాలను విలీనం చేయాలని, లేకపోతే బహిష్కరించి తమ నిరసన తెలియజేస్తామని చెప్పారు.

గొప్ప కార్మిక నాయకుడు వెంకటస్వామి



మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు, అధికారులు

హుస్నాబాద్: కార్మికుల అభ్యున్నతి కోసం కృషిచేసిన గొప్ప కార్మిక నాయకుడు కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి కొనియాడారు. వెంకటస్వామి జయంతి వేడుకలను మున్సిపల్ కార్యాలయం, అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ మూడుసార్లు కేంద్ర మంత్రిగా పనిచేసిన వెంకటస్వామి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ఏర్పాటు, సింగరేణి, బీడీ కార్మికులకు పెన్షన్ విధానాన్ని తీసుకురావడంలో విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. అలాగే హుస్నాబాద్‌లో వీవర్స్ కాలనీ ఏర్పాటు, బీడీ కార్మికులకు ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేశారని చెప్పారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, వివిధ పార్టీల నాయకులు చిత్తారి రవీందర్, ఎండీ హసేన్, గాదెపాక రవీందర్, వీరన్న పాల్గొన్నారు.

కలెక్టరేట్ కార్యాలయంలో..



వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హైమావతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కలెక్టరేట్‌లో నిర్వహించిన మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంటకస్వామి(కాకా) జయంతి ఉత్సవాల్లో కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఆమె వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఓ అబ్దుల్ రెహమాన్, షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా క్రీడలశాఖ అధికారికి సన్మానం

సిద్దిపేటజోన్: జిల్లా క్రీడలశాఖ అధికారి వెంకట్ నర్సయ్యను తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివానం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని ఒలింపిక్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. సైకిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక మందిని జాతీయస్థాయిలో ప్రాతినిథ్యం వహించేలా కృషిచేసిన ఆయనను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, అంతర్జాతీయ సైకిలింగ్ క్రీడాకారుడు మాక్స్‌వెల్ ట్రావర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకట్ నర్సయ్యను సన్మానిస్తున్న నిర్వాహకులు

యువజన మిత్రుల అలయ్ బలయ్



ఉద్యోగాలు పొందిన వారిని సన్మానిస్తున్న యువజన మిత్రులు

గజ్వేల్‌రూరల్: యువజన మిత్రుల అలయ్ బలయ్ కార్యక్రమం గజ్వేల్‌లో ఘనంగా జరిగింది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతోపాటు వర్గల్, జగదేవ్‌పూర్, మర్కుక్, రాయపోల్ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన యువజన నాయకులతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. యువత విద్య, వ్యాపార, రాజకీయ, సేవా రంగాల్లో రాణించి తమదైన ముద్ర వేయాలన్నారు. పార్టీలకతీతంగా యువతను ప్రోత్సహించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలో అలయ్ బలయ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని, ప్రతియేటా పార్టీలకతీతంగా ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టరేట్ పొందిన దేశబోయిన నర్సింహులు, గంగాల నరేశ్, ఎక్సైజ్ ఎస్‌ఐగా ఉద్యోగం పొందిన సలీంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో కొనసాగుతున్న యువజన మిత్రులు పాల్గొన్నారు.

గుంతలతో చింత..



మర్పడ్గ శివారులోని రైస్‌మిల్ టీ జంక్షన్ వద్ద ప్రమాదకరంగా మారిన గుంతలు

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గ శివారులోని రైస్‌మిల్లు వద్ద ఉన్న టీ జంక్షన్ చౌరస్తా వద్ద పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. దుద్దెడ శివారులోని రాజీవ్ రహదారి నుంచి మల్లన్నసాగర్, మర్పడ్గ, పొన్నాల మీదుగా సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల తదితర పట్టణాలకు వెళ్లేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దుద్దెడ శివారులోని టోల్‌ప్లాజా రుసుం పడకుండా ఉండేందుకు వాహనదారులు ఈ దారి గుండానే వెళ్తుంటారు. టీ జంక్షన్ వద్ద ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో దుర్గాదేవి నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో అమ్మవారి విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించి నృత్యాలు, కోలాటాల మధ్య అమ్మవారిని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.



చిన్నకోడూరు(సిద్దిపేట): విఠలాపూర్‌లో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకువెళ్తున్న యువకులు, చిన్నారులు



జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌లో దుర్గామాత ఊరేగింపు

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు కాంగ్రెస్ నాయకులు సూచించారు. ఆ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ కార్యక్రమాలు ప్రజలకు తెలుసన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అవినీతిని ప్రశ్నిస్తే కేసులు పెట్టారని గుర్తుచేశారు. రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, శ్రీనివాస్, ఐలయ్య, రమేశ్, రాములు, నర్సింగరావు పాల్గొన్నారు.